క్లుప్తంగా

ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలి



ఎమ్మెల్యే ఆనందరావుకు వినతిపత్రం అందిస్తున్న పీడీఎస్‌యూ ప్రతినిధులు

అమలాపురం టౌన్‌: జిల్లా కేంద్రం అమలాపురం పట్టణంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలని పీడీఎస్‌యూ, కామన్‌ మ్యాన్‌ ఫౌండేషన్‌ ప్రతినిధులు స్థానిక ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావుకు వినతి పత్రాన్ని బుధవారం అందించారు. అమలాపురంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల లేకపోవడం వల్ల ముమ్మిడివరం, అమలాపురం నియోజకవర్గాల్లో పేద విద్యార్థులు ఆర్థిక, దూరాభారం వంటి సమస్యలతో సతమవుతున్నారని వివరించారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రేవు తిరుపతిరావు, కామన్‌ మ్యాన్‌ ఫౌండేషన్‌ అధ్యక్షుడు కాశి చంద్రమౌళి, పి.దుర్గాప్రసాద్‌, మధుర రాజు తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్‌ చెక్కు అందజేత

ఉప్పలగుప్తం: ఇటీవల కృష్ణా జిల్లాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన రేవు భూషణం, పెసంగి కనకరాజు కుటుంబ సభ్యులకు రూ.5 లక్షల చొప్పున సీఎం రిలీఫ్‌ ఫండ్‌ చెక్కులను ఎమ్మెల్యే ఆనందరావు, అమలాపురం ఆర్డీవో కె.కేశవర్ధన్‌రెడ్డి బుధవారం ఎస్‌.యానంలో అందజేశారు. కార్యక్రమంలో తహసీల్దార్‌ టి.మల్లికార్జునరావు, మాజీ సర్పంచ్‌ లంకే భీమరాజు, పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రేవు తిరుపతిరావు, దంగేటి చిట్టిబాబు, ఉలిశెట్టి దొరబాబు, అయితాబత్తుల రాజశేఖర్‌, పలచోళ్ల పద్మనాభం, అయితాబత్తుల అజయ్‌, పలచోళ్ల బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌ఎఫ్‌ఐ బంద్‌ పిలుపు

అమలాపురం టౌన్‌: నీట్‌ పరీక్షా పత్రాల లీకేజీపై నిరసనగా గురువారం దేశవ్యాప్తంగా తలపెట్టిన విద్యా సంస్థల బంద్‌ కార్యక్రమాన్ని జిల్లాలోని అన్ని విద్యా సంస్థలు పాటించి సహకరించాలని భారత విద్యార్థి ఫెడరేషన్‌ (ఎస్‌ఎఫ్‌ఐ) జిల్లా కన్వీనర్‌ కె.ప్రణీత్‌ పిలుపునిచ్చారు. స్థానిక వడ్డిగూడెంలోని జిల్లా ఎస్‌ఎఫ్‌ఐ కార్యాలయంలో జిల్లా ప్రతినిధులు ప్రణీత్‌, శంకర్‌లు బుధవారం నిర్వహించిన సమావేశంలో జిల్లా విద్యా సంస్థల బంద్‌పై చర్చించారు. నీట్‌ పరీక్షా విధానాన్ని రద్దు చేసి అసెంబ్లీలో తీర్మానం చేయాలని డిమాండ్‌ చేశారు.

కలెక్టర్‌ హిమాన్షుశుక్లా కృషి అభినందనీయం

అల్లవరం: రైతుల సమస్యలను పరిష్కరించడంలో కోనసీమ జిల్లా తొలి కలెక్టర్‌గా హిమాన్షు శుక్లా కృషి అభినందనీయమని ఏపీ అగ్రిమిషన్‌ మాజీ సభ్యులు, దేవగుప్తం పీఏసీఎస్‌ అధ్యక్షులు జున్నూరి రామారావు అన్నారు. దేవగుప్తం సొసైటీలో బుధవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ 1991 నుంచి అస్తవ్యస్తమైన డ్రైనేజీ వ్యవస్థకు కలెక్టర్‌ హిమాన్షు శుక్లా ప్రత్యేక శ్రద్ధ తీసుకుని మోక్షం కల్పించారన్నారు. రైతులు క్రాప్‌ హాలీడే వైపు వెళ్లకుండా వ్యవసాయానికి పెద్ద పీట వేశారని కొనియాడారు.

పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలి



కామనగరువులో జ్యూట్‌ బ్యాగులు అందిస్తున్న ఎస్‌ఐ శేఖర్‌ బాబు

అమలాపురం రూరల్‌: ప్లాస్టిక్‌ వాడకాన్ని తగ్గించి ప్రతిఒక్కరూ పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలని అమలాపురం తాలూకా ఎస్‌ఐ శేఖర్‌బాబు పిలుపునిచ్చారు. అంతర్జాతీయ ప్లాస్టిక్‌ బ్యాగ్స్‌ రహిత దినోత్సవం సందర్భంగా స్ఫూర్తి ఫౌండేషన్‌ ఆధ్వర్యంలో బుధవారం కామనగరువులో ర్యాలీ నిర్వహించి ప్లాస్టిక్‌ కాలుష్యంపై ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థులకు జ్యూట్‌ బ్యాగులు అందజేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌ రాజులపూడి వెంకటేశ్వరరావు, కామన గంగాధరరావు, రాజులపూడి గంగాధర్‌రావు, దాసరి గోవిందరావు, రాజులపూడి మహేష్‌, స్వామి పాల్గొన్నారు.

వెంకన్న ఆలయంలో పూజలు

తాళ్లరేవు: మండలంలోని పి.మల్లవరంలో శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వర స్వామివారి ఆలయంలో ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు దంపతులు బుధవారం పూజలు నిర్వహించారు.

పిచ్చికుక్క దాడిలో ఎనిమిది మందికి గాయాలు

అమలాపురం రూరల్‌: పిచ్చికుక్క దాడి చేసిన ఘటనలో ఎనిమిది మందికి గాయాలయ్యాయి. బండారులంక పంచాయతీ సమీపంలో రెండు రోజులుగా పిచ్చికుక్క తిరుగుతోంది. కనిపించిన వారిపై దాడి చేసి గాయపరుస్తోంది. ఇలా రెండు రోజులుగా ఎనిమిది మంది గాయపడ్డారు. గ్రామంలోని పీహెచ్‌సీ, అమలాపురం ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందారు.

వెదజల్లు సాగు.. లాభాలు బాగు..

- తక్కువ సమయంలో ఎక్కువ దిగుబడులకు ఆస్కారం
- ఆసక్తి చూపిస్తున్న అన్నదాతలు



ముమ్మిడివరంలో విత్తనాలు వెదజల్లుతున్న రైతు



పట్టి లాగుతూ చేనును చదును చేస్తున్న రైతులు

ముమ్మిడివరం: వాతావరణం అనుకూలించక పలుచోట్ల నారుమడులు దెబ్బతిన్నాయి. మరోసారి నారు పోసేందుకు సమయం లేకపోవడంతో రైతులు ప్రత్యామ్నాయంగా వెదజల్లు సాగుకు సమాయత్తం అవుతున్నారు. దీనివల్ల సకాలంలో పంట చేతికి రావడంతో పాటు అధిక దిగుబడులు సాధించొచ్చని వ్యవసాయ అధికారులు చెబుతున్నారు. వెదజల్లు విధానంతో ఎకరాకు 40 బస్తాలకు పైగా దిగుబడులొస్తాయని వ్యవసాయ అధికారులు ప్రోత్సహిస్తుండడంతో పలువురు రైతులు వెదజల్లు సాగుకు ముందుకొస్తున్నారు.

ముమ్మిడివరం నియోజకవర్గంలోని ముమ్మిడివరం, కాట్రేనికోన, ఐ.పోలవరం, తాళ్లరేవు మండలాల్లోని పలు గ్రామాల్లో సుమారు 3 వేల ఎకరాల్లో వెదజల్లు సాగు చేపట్టారు. ఇప్పటికే ఆయా మండలాల్లోని కొందరు రైతులు గత ఐదేళ్లగా వెదజల్లు సాగు చేయడమే కాకుండా ఎకరాకు 48 బస్తాల వరకూ దిగుబడి సాధిస్తున్నారు. వారిని ఆదర్శంగా తీసుకుని మరికొందరు రైతులు వెదజల్లు సాగుకు ముందుకొస్తున్నారు. సాధారణ సాగులో ఎకరం వరి నారుమడికి 30 కేజీల విత్తనాలు అవసరమవుతాయి. వెదజల్లు పద్ధతిలో కేవలం 12 నుంచి 18 కేజీల విత్తనాలు మాత్రమే అవసరమవుతాయి. నారుమడులు పోసి ఊడ్చేందుకు పట్టే ఎక్కువ సమయాన్ని వెదజల్లు సాగుతో అరికట్టవచ్చు. దీని వల్ల ఖర్చు సైతం తగ్గుతుందని రైతులు చెబుతున్నారు. పైగా వెదజల్లు సాగు వల్ల తక్కువ సమయంలో ఎక్కువ విస్తీర్ణంలో సాగు చేసి కూలీల కొరతను అధిగమించవచ్చు. పంట పది రోజులు ముందే కోతకు వస్తుంది. మొక్కలో సాంద్రత పెరిగి పది శాతం మేర అధిక దిగుబడికి అవకాశం ఉంటుంది. అందుకే రైతులంతా వెదజల్లు సాగు చేపట్టాలని వ్యవసాయ అధికారులు సూచిస్తున్నారు.

ఇదీ సాగు విధానం

కాండం గట్టిగా ఉండి పడిపోని వరి రకం విత్తనాలు సిద్ధం చేసుకోవాలి. చేలలో 15 రోజులు ముందుగా దమ్ము చేసి మురగ బెట్టాలి. విత్తనాలు చల్లడానికి నాలుగు రోజులు ముందు మరోసారి దమ్ము చేసి పొలాన్ని చదును చేయాలి. మట్టి పేరుకున్న తరువాత ప్రతి రెండు మీటర్లకు మధ్య 12 సెంటీమీటర్ల వెడల్పున బోదెలను ఏర్పాటు చేయాలి. మడికట్టి మొలకెత్తిన విత్తనాలను చేలలో కొద్దిగా నీరు ఉండగా వెదజల్లాలి. వెదజల్లె చేలల్లో కలుపు బెడద ఎక్కువగా ఉంటుంది. దీని నివారణకు విత్తిన 8, 10 రోజుల వ్యవధిలో ఎకరాకు బెంథియోకార్బ్‌ 1.25 లీటర్లు, లేదా అనిలోఫాస్‌ 0.5 లీటర్లు 25 కిలోల ఇసుకతో కలిపి పొలమంతా సమానంగా వెదజల్లి అవసరమైన మేరకు తగిన మోతాదులో భాస్వరం, పొటాష్‌ ఎరువులు దుక్కిలో వేసి కలియదున్నాలి. విత్తిన 15, 35, 60 రోజులకోసారి సమపాళ్లలో నత్రజని ఎరువులు వేయాలి.

రాష్ట్ర స్థాయి చెస్‌ చాంపియన్‌గా సాత్విక్‌



సాత్విక్‌ను అభినందిస్తున్న రాష్ట్ర, జిల్లా చెస్‌ అసోసియేషన్‌ ప్రతినిధులు

అమలాపురం టౌన్‌: రాష్ట్ర స్థాయి చెస్‌ టోర్నమెంట్‌లో అమలాపురానికి చెందిన ద్రాక్షారపు సాత్విక్‌ ప్రతిభ చాటి చాంపియన్‌గా నిలిచాడు. రాజమహేంద్రవరం కాల్‌ ఫ్యూజస్‌ చెస్‌ అకాడమీ ఆధ్వర్యంలో జరిగిన ఈ టోర్నమెంట్‌లో ద్రాక్షారపు సాత్విక్‌ ఏడు రౌండ్లలో విజేతగా నిలిచినందుకు రూ.2,500 నగదు బహుమతిని కైవసం చేసుకున్నాడు. అలాగే అండర్‌–15 కేటగిరీలో కేశనకుర్తి రాజేష్‌ ప్రథమ స్థానంలో నిలిచి రూ.2,500 నగదు బహుమతి సాధించాడు. వీరితో పాటు విద్యార్థి బండారు నానిబాబు ద్వితీయ స్థానంలో నిలిచి రూ.1000 నగదు బహుమతిని పొందాడు. విజేతలకు రాజమహేంద్రవరం సరస్వతి స్కూల్‌ కరస్పాండెంట్‌ ప్రియా చౌదరి, రాష్ట్ర చెస్‌ అసోసియేషన్‌ సంయుక్త కార్యదర్శి వై.కల్యాణ్‌ బహుమతులు అందజేశారు. విజేతలను జిల్లా చెస్‌ అసోసియేషన్‌ కార్యదర్శి తాడి వెంకట సురేష్‌ అభినందించారు.

రాత్రికి రాత్రే షెడ్డు పుట్టుకొచ్చింది



ఉప్పలగుప్తం మండల పరిషత్‌ కార్యాలయం ఎదుట ప్రభుత్వ భూమిలో రాత్రికి రాత్రి నిర్మించిన రేకుల షెడ్డు

ప్రభుత్వ భూమిని కబ్జా చేసిన ఓ పంచాయతీ ఉద్యోగి

ఉప్పలగుప్తం: మండల కేంద్రం ఉప్పలగుప్తంలో స్థానిక మండల పరిషత్‌ కార్యాలయం ఎదుట ఉన్న ప్రభుత్వ భూమిలో రాత్రికి రాత్రే షెడ్డు పుట్టుకొచ్చింది. ఎప్పటినుంచో ఈ స్థలంపై కన్నేసిన ఓ పంచాయతీ ఉద్యోగి సదరు స్థలాన్ని కబ్జా చేసి మంగళవారం రాత్రి రేకుల షెడ్డును నిర్మించి నట్టుగా బుధవారం స్థానికంగా చర్చనీయాంశమైంది. వివరాల్లోకి వెళితే మండల పరిషత్‌ కార్యాలయం ఎదుట ఉన్న గ్రామ కంఠం భూమిలో కొంత కాలం క్రితం కొందరు నివాసాలు ఏర్పాటుచేసుకుని అక్కడే చిరు వ్యాపారాలు చేసుకునేవారు. సదరు స్థలానికి వెనుక భాగంలో ఉన్న వ్యవసాయ మార్కెట్టు యార్డుకు సంబంధించి గోదాము నిర్మాణం చేపట్టారు. అక్కడున్న నివాసాలు, షాపులను తీసివేసి షాపులను సైతం ప్రభుత్వం కట్టించి గ్రామ పంచాయతీ తరపున వారికి తిరిగి అద్దెకు ఇస్తామంటూ పంచాయతీ తీర్మానం సైతం చేశారు.

గ్రామ కంఠం జిరాయితీగా మారిపోయింది

స్థానికుడైన ఓ పంచాయతీ ఉద్యోగి మంగళవారం రాత్రి సమయంలో తన అనుచరుల సాయంతో గుట్టుచప్పుడు కాకుండా సదరు స్థలంలో రేకుల షెడ్డును నిర్మించేసుకున్నాడు. అంతేకాదు ఇంత కాలం గ్రామకంఠంగా ఉన్న భూమి రికార్డుల్లోనూ సదరు ఉద్యోగి తల్లి పేరు మీదకు మార్చేశారని కొందరు స్థానికులు చెబుతున్నారు. సదరు రేకుల షెడ్డును షాపులుగా విడదీసి అద్దెకు ఇచ్చుకోవాలన్నది ఆయన దూరాలోచనగా స్థానిక పంచాయతీ సిబ్బంది చెబుతున్నారు. సదరు ఉద్యోగి కబ్జాపై బుధవారం జిల్లావ్యాప్తంగా పంచాయతీ శాఖ ఉద్యోగ వర్గాల్లోనూ చర్చ సాగింది. ఈ విషయంపై స్థానిక పంచాయతీ కార్యదర్శి టి.రామకృష్ణను వివరణ కోరగా తాను అనారోగ్యం కారణంగా బుధవారంలో సెలవులో ఉన్నానన్నారు. పంచాయతీకు సంబంధించిన భూమిలో నిర్మాణాలు చేపట్టిన విషయం తన దృష్టికి వచ్చిందని, దీనిపై ఉన్నతాధికారులతో చర్చించి చర్యలు తీసుకుంటామన్నారు.

వారాహి నవరాత్ర మహోత్సవాల ప్రారంభం



అమ్మవారి ధ్వజాన్ని ఆవిష్కరిస్తున్న అక్షయ పాత్ర ప్రతినిధులు

అమలాపురం టౌన్‌: స్థానిక విద్యుత్‌ నగర్‌లోని ఆదిశేష నిలయంలో వారాహి నవరాత్ర మహోత్సవాలు బుధవారం సాయంత్రం ప్రారంభమయ్యాయి. ఆదిశేష నిలయం ప్రాంగణంలో శ్రీగౌతమ మహర్షి అక్షయ పాత్ర సంస్థ ప్రతినిధి లింగోలు అన్నవరం (పండు) వారాహి అమ్మవారి ధ్వజం ఆవిష్కరించారు. గురువారం ఉదయం లఘు సర్వతోభద్ర వేదికపై 33 మంది మర్మ దేవతల ఆవాహన, శుక్రవారం సాయంత్రం ఆరు గంటలకు అఖండ హోమం ప్రారంభమై ఈ నెల 16వ తేదీ అర్ధరాత్రి 12 గంటల వరకూ సాగుతుందని అక్షయ పాత్ర ప్రతినిధి సలాది సాయిరామ్‌ తెలిపారు. అక్షయ పాత్ర ప్రతినిధులు పోతుల నాగకనకదుర్గ, పితాని శ్రీనివాస్‌, ఉద్దీశపు చిన్నా, పనసా బుజ్జి, తూము దొరబాబు, లింగోలు విస్సు, గొవ్వాల అచ్యుత రామయ్య తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ప్రపంచ మెకానిక్‌ డే



చిన్నారులతో కేక్‌ కట్‌ చేయిస్తున్న అసోసియేషన్‌ నాయకులు

అమలాపురం రూరల్‌: స్థానిక వరసిద్ధి వినాయక మెకానిక్‌ యూనియన్‌ ఆధ్వర్యంలో ప్రపంచ మెకానిక్‌ డే వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఈదరపల్లిలో హరి మనోవికాస కేంద్రంలోని చిన్నారులతో కేక్‌ కట్‌ చేయించారు. చిన్నారులకు బిస్కెట్లు అందించారు. అనంతరం లూయీ అంధుల పాఠశాలలో విద్యార్థులకు భోజనాలు ఏర్పాటు చేశారు. కార్యక్రమాల్లో అసోసియేషన్‌ అధ్యక్షుడు గుద్దటి రెడ్డి నాయుడు, అసోసియేషన్‌ సభ్యులు పాల్గొన్నారు.

విద్యుత్‌ సరఫరాకు నేడు అంతరాయం

యానాం: పట్టణంలో 11 కేవీ హెచ్‌టీ లైన్ల నిర్వహణ నిమిత్తం గురువారం విద్యుత్‌ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్‌శాఖ అధికారులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. బుధవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ మెట్టకూరు, గణపతినగర్‌, నవాజ్‌కాలనీ, రమాబాయినగర్‌, వంశీకృష్ణకాలనీ, జీఎస్‌నాయుడు కాలనీ, రాజరాజేశ్వరనగర్‌, సీతమ్మపేట, రామన్నకోడు, అంబేడ్కర్‌నగర్‌, బుద్ధాపార్క్‌ ప్రాంతాల్లో విద్యుత్‌ సరఫరా నిలిచిపోతుందన్నారు.

ప్లాస్టిక్‌ టిన్నుల అందజేత

తాళ్లరేవు: పటవల పంచాయితీలోని ఎనిమిది అంగన్‌వాడీ కేంద్రాలకు స్థానిక సాయితేజ స్కూల్‌ కరస్పాండెంట్‌ బోణం శ్రీనివాస్‌ సహకారంతో ప్లాస్టిక్‌ టిన్నులను అందజేశారు. అనంతరం పటవలలో పక్షవాతం బారిన పడిన స్నేహితుడు గండి అప్పారావుకు శ్రీనివాస్‌ రూ.10 వేలు, కోసూరి రామారావు రూ.3 వేలు ఆర్థిక సాయం చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ రాయుడు సునీత, కుడుపూడి శివన్నారాయణ, రాయుడు గంగాధర్‌ తదితరులు పాల్గొన్నారు.

మహాప్రస్థానం వాహనం ప్రారంభం



మహాప్రస్థానం వాహనాన్ని సమకూర్చిన దాతను సత్కరిస్తున్న ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు

అమలాపురం రూరల్‌: కలెక్టరేట్‌లో రెడ్‌ క్రాస్‌ ఆధ్వర్యంలో దాతలు ఇచ్చిన మహాప్రస్థానం వాహనాన్ని కలెక్టర్‌ హిమాన్షు శుక్లా, ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు బుధవారం జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా రూ.16 లక్షలు విలువచేసే మహాప్రస్థానం వాహనాన్ని సమకూర్చిన దాతలు చెరుకూరి కృష్ణంరాజు, పిన్నమరాజు కాశీ విశ్వనాథరాజు, సాగి వెంకట రామరాజులను కలెక్టర్‌, ఎమ్మెల్యే, రెడ్‌ క్రాస్‌ సభ్యులు సత్కరించారు. మహా ప్రస్థానం వాహనం అమలాపురం రెడ్‌ క్రాస్‌ కార్యాలయ ఆవరణలో ఉంటుందని, జిల్లా పరిధిలో మృతదేహాలను తరలించేందుకు వాహనం అవసరమైన వారు 99492 94083, 73969 99946 సెల్‌ నెంబర్లకు ఫోన్‌ చేసి వాహన సర్వీసులను ఉచితంగా పొందొచ్చని జిల్లా రెడ్‌ క్రాస్‌ చైర్మన్‌ కేఎస్‌ నారాయణ తెలిపారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి ఎం.వెంకటేశ్వర్లు, రెడ్‌ క్రాస్‌ మాజీ చైర్మన్‌ డాక్టర్‌ పి.శర్మ, రెడ్‌ క్రాస్‌ కోఆర్డినేటర్‌ రత్న ప్రసాద్‌ తదితరులు పాల్గొన్నారు.

సీఎం రంగసామి అభివృద్ధికి సహకరించడం లేదు



జేపీ నడ్డాను కలిసిన ఎమ్మెల్యేల బృందం

యానాం: సీఎం రంగసామి గత మూడేళ్లుగా తమ నియోజకవర్గాల్లో అభివృద్ధికి సహకరించకుండా ఏకపక్ష వైఖరిని అవలంబిస్తున్నారని, ఇదే కొనసాగితే కూటమి ప్రభుత్వానికి మద్దతు ఉపసంహరించుకుంటామని పలువురు ఎమ్మెల్యేలు కేంద్ర బీజేపీ అధిష్టానానికి స్పష్టం చేశారు. రాజ్యసభ సభ్యుడు సెల్వగణపతి ఆధ్వర్యంలో బీజేపీకి చెందిన ముగ్గురు ఎమ్మెల్యేలు, ఇద్దరు బీజేపీ నామినేటెడ్‌ ఎమ్మెల్యేలు, మరో ముగ్గురు ఇండిపెండెంట్‌ ఎమ్మెల్యేలు కలిసి బీజేపీ అధ్యక్షుడు జేపీ నడ్డాను బుధవారం ఢిల్లీలో కలిశారు. సీఎం రంగసామి వైఖరి, తమ నియోజకవర్గాల్లో సమస్యల పరిష్కారానికి చర్యలపై త్వరగా నిర్ణయం తీసుకోవాలని విన్నవించారు. కార్యక్రమంలో బీజేపీ ఎమ్మెల్యేలు జాన్‌కుమార్‌, రిచర్డ్‌, కల్యాణసుందరం, ఇండిపెండెంట్‌ ఎమ్మెల్యేలు గొల్లపల్లి శ్రీనివాస్‌ అశోక్‌, అంగళన్‌, శివశంకర్‌ తదితరులు పాల్గొన్నారు.

కాచి చల్లార్చిన నీటినే తాగాలి



డయేరియాపై అధికారులతో చర్చిస్తున్న ఆర్‌ఏఓ మునిస్వామి

యానాం: డయేరియా బారిన పడకుండా ఉండేందుకు ప్రతిఒక్కరూ కాచి చల్లార్చిన నీటినే తాగాలని ఆర్‌ఏఓ మునిస్వామి సూచించారు. డయేరియా వ్యాధిపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు చేపట్టాల్సిన చర్యలపై ఆయన అధ్యక్షతన స్థానిక ఆర్‌ఏఓ చాంబర్‌లో బుధవారం ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జీజీహెచ్‌ డీడీ టి.రవిశంకర్‌ మాట్లాడుతూ నియోజకవర్గ పరిధిలోని తీర గ్రామాలు, పట్టణ ప్రాంతాల్లో ఉన్న సబ్‌సెంటర్లు, ఆరోగ్యకేంద్రాలకు ఓఆర్‌ఎస్‌ ప్యాకెట్లు, జింక్‌ మాత్రలను ఇప్పటికే తరలించామన్నారు. కార్యక్రమంలో నోడల్‌ ఆఫీసర్‌ డాక్టర్‌ అనూరాధ, ఇన్‌చార్జి మున్సిపల్‌ కమిషనర్‌ కె.రామకృష్ణ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

పీఆర్‌ వన్‌ యాప్‌పై అవగాహన పెంచుకోవాలి



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న ఎంపీడీవో మల్లికార్జునరావు

అమలాపురం రూరల్‌: పీఆర్‌ వన్‌ యాప్‌పై పంచాయతీరాజ్‌, ఆర్‌డబ్ల్యూఎస్‌ ఉద్యోగులు అవగాహన పెంచుకోవాలని ఎంపీడీవో మల్లిఖార్జునరావు సూచించారు. స్థానిక మండల పరిషత్‌ కార్యాలయంలో బుధవారం గూగుల్‌ మీట్‌ ద్వారా పంచాయతీరాజ్‌, ఆర్‌డబ్ల్యూఎస్‌ ఉద్యోగులకు సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మల్లిఖార్జునరావు మాట్లాడుతూ పీఆర్‌ వన్‌ యాప్‌ను అందరూ వినియోగించాలన్నారు. ప్రభుత్వం అమలు చేసే అన్ని కార్యక్రమాలను ఈ యాప్‌లో పొందుపరచాలని చెప్పారు. కమిషనర్‌ స్థాయి నుంచి ఇంజినీరింగ్‌ అసిస్టెంట్‌ వరకూ ఇదే యాప్‌ను ఉపయోగించాల్సి ఉంటుందన్నారు. సదస్సులో జిల్లా కార్యదర్శుల సంఘం అధ్యక్షుడు అర్‌ఎస్‌ఎస్‌ సూరపరాజు, కార్యదర్శులు కె.వెంకటేశ్వరరావు, అదినారాయణ, ధనలక్ష్మి, అనంతలక్ష్మి, కట్టా సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

మొక్కల పెంపకంతోనే మనుగడ సాధ్యం



రూరల్‌ సీఐ కార్యాలయం వద్ద మొక్కలు నాటుతున్న సీఐ వీరబాబు తదితరులు

అమలాపురం రూరల్‌: మొక్కల పెంపకంతోనే మానవ మనుగడ సాధ్యమని అమలాపురం రూరల్‌ సీఐ పూడి వీరబాబు, సీడీపీఓ విజయ కుమారి అన్నారు. ప్రతిఒక్కరూ మొక్కలు పెంచడమే కాకుండా వాటిని సంరక్షించాలని సూచించారు. పర్యావరణ పరిరక్షణ కార్యక్రమంలో భాగంగా బుధవారం కామనగరువులో అధికారులు, ఐసీడీఎస్‌ కార్యకర్తలు, విద్యార్థులు భారీ ర్యాలీ నిర్వహించారు. రూరల్‌ సీఐ కార్యాలయ ఆవరణలో సీఐ వీరబాబు, రూరల్‌ ఎస్‌ఐ శేఖర్‌ బాబు తదితరులు మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఆర్‌డీవో ఆఫీస్‌ అడ్మినిస్ట్రేటివ్‌ ఆఫీసర్‌ ఎం.పాల్‌ బాబు, ప్రిన్సిపాల్‌ రామప్రసాద్‌, ఐసీడీఎస్‌ సూపర్‌వైజర్‌ లీలాకుమారి, ఏపీఎం రమణ తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్‌ భూతంతో మానవాళికి ముప్పు



విశ్వేశ్వరాయపురంలో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు, స్వచ్ఛంద సేవా సంస్థల ప్రతినిధులు

మలికిపురం: మండలంలోని విశ్వేశ్వరాయపురం వివేకానంద ఆంగ్ల మాధ్యమ ఉన్నత పాఠశాలలో జనవిజ్ఞాన వేదిక(జేవీవీ) మలికిపురం శాఖ ఆధ్వర్యంలో బుధవారం అంతర్జాతీయ ప్లాస్టిక్‌ బ్యాగ్‌ రహిత దినోత్సవాన్ని నిర్వహించారు. అనంతరం విద్యార్థులు భారీ ర్యాలీ నిర్వహించారు. ప్లాస్టిక్‌ వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పిస్తూ పాఠశాల కరెస్పాండెంట్‌, జేవీవీ మండల అధ్యక్షుడు పీవీవీ వరప్రసాద్‌ మాట్లాడుతూ నేటి కాలంలో ప్లాస్టిక్‌ వినియోగం విపరీతంగా పెరిగిందని తినటానికి, తాగడానికి, బజారు నుంచి సరుకులు తెచ్చుకోవడానికి ఇలా ప్రతి పనికి ప్లాస్టిక్‌ బ్యాగులను వినియోగిస్తున్నారన్నారు. ప్లాస్టిక్‌ వినియోగం వల్ల పారిశుధ్య సమస్యలతో పాటు అనేక రకాల అనారోగ్యాలు కలుగుతున్నాయని అన్నారు. తాగడానికి, తినడానికి స్టీల్‌ సామాన్లను వాడుకోవాలన్నారు. అలాగే మానవతా మూర్తులు గ్రూప్‌ అడ్మిన్‌ బోనం రాజు మాట్లాడుతూ ప్లాస్టిక్‌ బహుమతుల స్థానంలో మొక్కలు, క్లాత్‌ వస్తువులను అందజేయాలని, పర్యావరణాన్ని కాపాడుకోవడం మన అందరి బాధ్యత అని అన్నారు. కార్యక్రమంలో జంపన బుజ్జి రాజు, మధు రాజు, అటారం మాస్టారు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

హైకోర్టు ఉత్తర్వులను అమలు చేయాలి

యానాం: గౌతమీ గోదావరి ఐలాండ్‌ నెంబరు–5లో చేపట్టిన పర్యాటక ప్రాజెక్టు వరదలకు కొట్టుకుపోయి రూ.5.45 కోట్ల ప్రజాధనం వృథా అవ్వడంపై మద్రాసు హైకోర్టు జస్టిస్‌ ఏడీ జగదీషచంద్ర ఇచ్చిన ఆదేశాలను అమలు చేయాలని సుంకర స్వామినాయుడు వెల్ఫేర్‌ ఆర్గనైజేషన్‌ అధ్యక్షుడు సుంకర కార్తీక్‌ డిమాండ్‌ చేశారు. ఈ మేరకు తాను చీఫ్‌ విజిలెన్స్‌ కమిషనర్‌కు, పుదుచ్చేరి ప్రధాన కార్యదర్శికి వినతి పత్రం పంపినట్లు బుధవారం ఆయన విలేకరులకు తెలిపారు. ఘటనపై ఆరు వారాల్లోగా చర్యలు తీసుకోవాలని 2019 మే 6వ తేదీన కోర్టు ఆదేశాలిచ్చినా ఇప్పటివరకూ చర్యలు లేవన్నారు. ఆదేశాలిచ్చి 5 ఏళ్ల అవుతున్నా పట్టించుకోకపోవడం కోర్టు ఆదేశాల ఉల్లంఘన కిందకు వస్తుందన్నారు.

వైభవంగా లక్ష్మీనృసింహుని కల్యాణం



అంతర్వేదిలో నిర్వహిస్తున్న స్వామి కల్యాణం

సఖినేటిపల్లి: అంతర్వేది లక్ష్మీనృసింహుని ఆలయంలో బుధవారం ఆర్జిత సేవగా స్వామివారి శాంతి కల్యాణం బహుళ ద్వాదశి తిథి నాడు అర్చకులు ఘనంగా నిర్వహించారు. తొలుత ఆలయంలోని కల్యాణ మండపంలో ప్రత్యేక వేదికపై ఉత్సవమూర్తులను కొలువుదీర్చారు. అనంతరం స్వామివారి శాంతి కల్యాణం విష్వక్సేన పూజతో అర్చకులు ప్రారంభించారు. వేద మంత్రాలతోను, మంగళవాయిద్యాల నడుమ కనుల పండువగా ప్రధాన అర్చకుడు పాణింగిపల్లి శ్రీనివాస కిరణ్‌ ఆధ్వర్యాన స్థానాచార్య వింజమూరి రామరంగాచార్యులు, అర్చకుడు పెద్దింటి వేంకట శ్రీనివాస్‌, వేద పండితులు ఈ కల్యాణం వైభవంగా నిర్వహించారు. కల్యాణంలో పాల్గొన్న భక్తులకు దేవస్థానం స్వామి మూలవిరాట్‌ దర్శనం కల్పించింది. అలాగే లడ్డూ ప్రసాదం ఇచ్చి, అన్నదాన పథకంలో భోజన సౌకర్యం కల్పించింది. ఆలయ అసిస్టెంట్‌ కమిషనర్‌ వి.సత్యనారాయణ, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామాల శుభ్రతతోనే స్వచ్ఛభారత్‌ సాకారం



పినపళ్లలోని గ్రామస్తులకు కిట్లు అందజేస్తున్న ఓఎన్జీసీ అధికారులు

ఆలమూరు: పరిశుభ్రమైన ఇల్లుతో పాటు శుభ్రతతో కూడిన పరిసరాలే స్వచ్ఛ భారతానికి ఆభరణాలు అంటూ బుధవారం పినపళ్ళలో ఓఎన్జీసీ స్వచ్ఛ పక్వాడ పక్షోత్సవాలు జరిగాయి. స్థానిక ఓఎన్జీసీ కార్యాలయం సైట్‌లో మేనేజర్‌ పి.జగన్నాథరావు, సర్పంచ్‌ సంగిత సుభాష్‌ ఆధ్వర్యంలో స్వచ్ఛభారత్‌ అవగాహన కార్యక్రమం జరిగింది. పరిసరాల పరిశుభ్రత తదితర అంశాలపై ఓఎన్జీసీ అధికారులు ఏర్పాటు చేసిన బుర్రకథ గ్రామస్తులను విశేషంగా ఆకట్టుకుంది. అనంతరం గ్రామంలో స్వచ్ఛ భారత్‌ ఆవశ్యకతను వివరిస్తూ ఓఎన్జీసీ అధికారులు, పంచాయతీరాజ్‌, ఆరోగ్య అంగన్వాడీ సిబ్బంది భారీ ర్యాలీ నిర్వహించారు. ఎంపీటీసీ పెద్దిరెడ్డి పట్టాభి, ఉప సర్పంచ్‌ యనమదల రాణి, పంచాయతీ కార్యదర్శి ఎస్‌.వీర్రాజు, సచివాలయ సిబ్బంది, అంగన్వాడీలు పాల్గొన్నారు.